# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 134 ప్రకాశం, శుక్రవారం 13- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జ్‌లు
- నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లు కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## బీచ్ ఫెస్టివల్‌కు ట్రాఫిక్, భద్రత, సముద్ర స్నానాలపై ప్రత్యేక చర్యలు

### ఎస్ పి వి . హర్ష వర్ధన్ రాజు



**ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి,** సింగరాయకొండమండలంలోనిపాకల బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ప్రజలకు ఆహ్లాదకరమైన అనుభూతితో పాటు పూర్తి భద్రత కల్పించడమే లక్ష్యంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు.

బీచ్ ఫెస్టివల్‌కు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో సముద్ర తీర ప్రాంతం, పరిసర ప్రాంతాలు వాహన పార్కింగ్ స్థలాలు, ప్రవేశ–-నిష్క్రమణ మార్గాలు అన్నింటిలోనూ పటిష్టమైన భద్రతచర్యలను అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఫెస్టివల్ రోజుల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యేక ట్రాఫిక్ ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు. బీచ్‌కు వచ్చే వాహనాలకు ప్రత్యేక మార్గాలు కేటాయించడంతో పాటు, రెండు చక్రాల నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన చోట్ల ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేసి, పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఫ్లెక్సీలు, సైన్ బోర్డులు, ఎంట్రీ--ఎగ్జిట్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీచ్‌కు వచ్చే మార్గంలో వాహనాలు ఆగిపోతే వెంటనే తొలగించేందుకు క్రేన్లు టోయింగ్ వాహనాలు సిద్ధంగా ఉంచుతున్నామన్నారు.

సముద్రంలో స్నానం చేసే ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులు, మెరైన్ సిబ్బంది, 50 మంది గజ ఈతగాళ్లను నియమించనున్నట్లు తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి,నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే సముద్ర స్నానాలకు అనుమతి ఇస్తామని చెప్పారు. ఎవరూ సముద్రంలో లోతుగా వెళ్లకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తారని తెలిపారు.

బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించనున్న కాంపిటేటివ్ గేమ్స్, వినోదాత్మక కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు సురక్షితంగా జరిగేలా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల వేదికల వద్ద ప్రేక్షకుల ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తారన్నారు. ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఎవరైనా ఉత్సాహంలో మితిమీరకుండా శృతిమించకుండా, నిర్ణయించిన పరిమితులను దాటకుండా బాధ్యతా యుతంగా వ్యవహరించాలన్నారు. సముద్రంలో ప్రమాదకరంగా ప్రవర్తించ కూడదని,మద్యం సేవించి సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరించారు. పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు .ట్రాఫిక్ నిబంధనలను పాటించి,వాహనాలను అనుమతించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలపాలని, ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, ప్రజలందరూ పోలీసు శాఖ సూచనలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బీచ్ ఫెస్టివల్‌ను సురక్షితంగా,ఆనందంగా, గుర్తుండిపోయే విధంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. ఫెస్టివల్ ప్రాంతమంతా సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు, అనుమానాస్పద కదలికలపై వెంటనే స్పందించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అన్ని విభాగాలు సమ న్వయంతో పనిచేస్తాయని చెప్పారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని లేదా 112/100 నంబర్లకు గాని తెలియపరచాలని ప్రజలను కోరారు. ఆయన వెంట ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, మెరైన్ సీఐ జి. శివన్నారాయణ సింగరాయకొండ ఎస్సై బి. మహేంద్ర, టంగుటూరు ఎస్సై నాగమలేశ్వరరావు, జరుగుమల్లి ఎస్సైబి. మహేంద్ర సిబ్బంది ఉన్నారు.

## మాలకొండ ఆలయ వేలం పాటలు వాయిదా? డిసీ చంద్రశేఖర్



**వలేటివారిపాలెం క్రైశీ కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి** మండలంలోని మాలకొండలో కొలువుతీరి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వేలంపాటలను అనివార్య కారణాల వలన వాయిదా జరిగిందని ఆలయ డిసి చంద్రశేఖర్ తెలిపారు. తల నీలాలు, కొబ్బరికాయలు, పార్కింగ్ తదితర విభాగాలకు చెందిన వేలం పాటలను ఆలయ ప్రాంగణంములో ఈనెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు జరుగుతాయని ఆయన తెలియజేశారు.

## పట్టణ ప్రజలకు వ్యాపారులకు పోలీసు సమాచారం



**క్రైం కౌంటర్ ప్రతినిధి టి. నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,** పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందువలన గతంలో ఉదయం 08.00 గంటల నుండి రాత్రి 08.00 గంటల వరకు ఎలాంటి హెవీ వెహికిల్స్ కి పట్టణంలోకి అనుమతి లేదు అని ఉత్తర్వులు అమలలో ఉన్నాయని సిఐ అన్వర్ భాషా తెలిపారు. వ్యాపారుల యొక్క విజ్ఞప్తి మేరకు మధ్యాహ్నం 01.00 నుండి 03.00 గంటల వరకు వ్యాపారమునకు సంబంధించిన లారీలను పట్టణంలోకి అనుమతించడం జరుగుతుందనిచెప్పారు. ఉదయం 08.00 నుండి మధ్యాహ్నం 01.00 గంటల వరకు మధ్యాహ్నం 03.00 గంటల నుండి రాత్రి 08.00 వరకు లారీలు,పొట్టు కర్రలు లోడు ట్రాక్టర్లు మొదలగు హెవీ వెహికల్స్ పట్టణంలోకి అనుమతి లేదని పై ఉత్తర్వులను ఉల్లంఘించి పట్టణంలోకి ప్రవేశించిన ఎడల వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

## గోద్రేజ్ ఆగ్రోవెట్ 'టకాయ్' మార్కెట్లోకి విడుదల




**క్రైమ్ కౌంటర్ న్యూస్....** ముంబాయి జనవరి 12 : గోద్రేజ్ ఆగ్రోవెట్ సరికొత్త కీటక నాశని టకాయ్ మార్కెట్లోకి విడుదలైంది. ఈ సందర్భంగా ఓ హోటల్లో జరిగిన కార్యక్రమంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొడక్షన్ బిజినెస్ సీఈవో ఎస్ కే రాజవేలు మాట్లాడుతూ భారతదేశంలో వైవిధ్యభరితమైన వాతావరణంలో వరి సాగు చేసిన రైతుల ప్రయోజనాల కోసం తమ సంస్థ టకాయ్ ని అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. జపాన్ కు చెందిన ఐఎస్కే సంస్థ సైక్లానిప్ టీహెచ్ఎం టెక్నాలజీతో ఈ టకాయ్ ని రూపొందించిందని తెలిపారు. వరిలో ప్రధానంగా కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పరుగులను నాశనం చేయడంలో ఇది అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుందని వివరించారు. నాట్లు వేసిన తర్వాత కీలకమైన ప్రాథమిక దశ అయిన 15 నుంచి 30 రోజుల మధ్య ఒకసారి, మళ్లీ 40 నుంచి 60 రోజుల మధ్యలో ఒకసారి 160 మిల్లీ లీటర్ల మోతాదులో పిచికారీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మందు పంటలను ఆశించిన పురుగులు ఆహారం తీసుకోకుండా తక్షణమే అడ్డుకుంటుందని, దీర్ఘకాలం పాటు తెగుళ్లను అదుపు చేస్తుందని తెలిపారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, ఉత్పత్తి పెరుగుతుందని, స్థిరమైన మంచి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. టకాయ్ అనేది వరితోపాటు మొక్కజొన్న, మిరప, క్యాబేజీ, సోయాబీన్, శనగ, చెరుకుల పంటలకు కూడా వినియోగించవచ్చని వివరించారు. రైతుల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ కోసం తమ సంస్థ చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ఈకార్యక్రమంలో జోనల్ హెడ్ మధు, అసిస్టెంట్ మేనేజర్ మురళి మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు....

## కొలికపూడి శ్రీనివాస్ పై మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఇటీవల విమర్శలు వస్తుండడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ రోజు అసెంబ్లీ లాబీలో కొలికపూడితో పల్లా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీతోనే ఆయనకు గుర్తింపు వచ్చిందని, వ్యక్తిగతంగా ఆయన జీరో అనే విషయాన్ని గుర్తించాలంటూ పల్లా శ్రీనివాస్ హితవు పలికారు. అది గుర్తించి నడుచుకోవాలని సూచించారు. పార్టీ లైన్ దాటితే ఉపేక్షించబోమని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలను కొలికపూడికి తెలియజేశారు. వాట్సప్ స్టేటస్ లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా ఆయనను నిలదీశారు. మందలించినా కూడా పద్ధతి మార్చుకోకుంటే పార్టీ ఆయనను ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని స్పష్టం చేశారు.

## ఐఐటీ తిరుపతిలో ఇంటర్న్‌షిప్‌కు ప్రకాశం విద్యార్థులు ఎంపిక



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ తిరుపతిలో మూడు నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచిందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం నుండి ఏడుగురు, మెకానికల్ విభాగం నుండి ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో భాగంగా త్రీడీ ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్ వంటి అంశాల్లో ట్రైనింగ్‌తో పాటు ప్రాజెక్ట్ డిజైన్‌పై ప్రత్యేక శిక్షణ అందుకుంటారని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, వారికి మార్గదర్శకత్వం వహించిన ఆర్ అ డి డీన్ డాక్టర్ ముప్పా లక్ష్మణరావు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కె. సింగయ్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి డాక్టర్ కె. సుబ్బారెడ్డి ను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలలో రీసెర్చ్ ఎంటర్‌ప్రెన్యూర్షిప్ సెల్స్ ద్వారా విద్యార్థులకు స్టార్టప్స్ ప్రారంభించేందుకు తగిన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత తరం విద్యార్థులకు చదువుతో పాటు ఇతర నైపుణ్యాలు అత్యంత ముఖ్యమని, ఆ దిశగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చదలవాడ రవికుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు పేపర్ పబ్లికేషన్స్, ప్రొడక్ట్ తయారీ, పేటెంట్ దరఖాస్తులు, కాన్ఫరెన్సులు, ఇంటర్న్‌షిప్స్, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ వంటి అన్ని రంగాల్లో సమగ్ర శిక్షణ అందించి ఉద్యోగ మార్కెట్లో మెరుగైన అవకాశాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వరపర్ల హరిబాబు, ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు సిబ్బంది ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# దోర్నాల నుండి శ్రీశైలం వెళ్లే ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం లేకుండా సమగ్ర చర్యలు - జిల్లా ఇన్చార్జి ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్.



**క్రైమ్ కౌంటర్ న్యూస్... మార్కాపురం జిల్లా....**మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం దేవస్థానానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, దోర్నాల నుండి శ్రీశైలం వరకు ఉన్న ఘాట్ రోడ్డులో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఇన్చార్జి ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., తెలిపారు.
భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు, హైవే పెట్రోలింగ్ వాహనాలు, టోయింగ్ వెహికల్స్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.
భద్రతా చర్యలు ఒ ట్రాఫిక్ నియంత్రణ:
ఘాట్ రోడ్డులో అనుభవం ఉన్న డ్రైవర్ల వాహనం నడపాలి.
రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించరాదు.
డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయబడింది.
రద్దీ సమయాల్లో అదనపు పోలీస్ సిబ్బందిని మోహరించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తారు.
భారీ వాహనాల రాకపోకలను నియంత్రించి, వాటికి నిర్దిష్ట సమయాలు కేటాయించబడతాయి.
ప్రమాదాలను నివారించేందుకు హెచ్చరిక బోర్డులు, సూచికలు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయడం జరిగింది.
ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు విధుల్లో ఉంటాయి.
ప్రయాణికులకు సూచనలు:
ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలి.
ఘాట్ రోడ్డులో అతి వేగం, ఓవర్‌టేకింగ్ పూర్తిగా నివారించాలి.
అనవసరంగా రోడ్డు పక్కన వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదు.
నైపుణ్యం కలిగిన డ్రైవర్లతోనే ప్రయాణం చేయాలి.
వాహనాల బ్రేకులు, టైర్లు, ఇంజిన్ పరిస్థితి ముందుగా తనిఖీ చేసుకోవాలి.
పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలను గౌరవించి సహకరించాలి.
ప్రయాణికులు, భక్తులకు ట్రాఫిక్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గారు తెలిపారు.
అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని మహాశివరాత్రి వేడుకలను శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.....

# మార్కాపురంపట్టణంలో హోరెత్తిన కార్మిక గళం..





**క్రైమ్ కౌంటర్ న్యూస్ ...మార్కాపురం జిల్లా....** కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...
సమ్మెలో పాల్గొన్న ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్టీయూసీ సంఘాలు.
కార్మికులకు మద్దతుగా రోడ్లపైకి వచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు.
సమ్మె ప్రభావంతో మార్కాపురం పట్టణంలో పలుచోట్ల నిలిచిపోయిన కార్యకలాపాలు.
ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ముక్తకంఠంతో నినదిస్తున్న కార్మిక, ఉ ద్యోగ సంఘాలు....

# ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ మార్కాపురం రెడ్డి సంక్షేమ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ఎప్పటిలాగే 6వ సంవత్సరం







**క్రైమ్ కౌంటర్ న్యూస్..... మార్కాపురం జిల్లా....**
ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ మార్కాపురం రెడ్డి సంక్షేమ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ఎప్పటిలాగే 6వ సంవత్సరం ,
పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్లే శివస్వాములు, శివభక్తులు ఎంతటి భక్తి, శ్రద్ధతో ఈ యాత్ర చేస్తున్నారు అనేది మనందరికీ తెలుసు. వారి ఆధ్యాత్మిక ప్రయాణంలో చిన్న సహాయం చేయడం కూడా మహా పుణ్యకార్యం.
అందుకే రెడ్డి సంఘం తరపున ఈ రోజు నడిచిపోయే శివస్వాములకు అల్పాహారం, తాగునీరు, పండ్లు ,ఏర్పాటు చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఇది సేవ మాత్రమే కాదు, శివుని పాదసేవ అని మేము నమ్ముతున్నాం.
భక్తుల యాత్ర సాఫల్యంగా పూర్తి కావాలని, పరమశివుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాం.
హర హర మహాదేవ్ ,. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజక వర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి, వెన్నా వెంకట రెడ్డి,తిరుమల రెడ్డి రామిరెడ్డి ,కుందూరు రమణారెడ్డి,చిట్టిరెడ్డి నరసింహ రెడ్డి,గుంటక భాస్కర్ రెడ్డి, బట్టగిరి లక్ష్మిరెడ్డి,ఐ ఎ =, కుందూరు సుబ్బారెడ్డి, బట్టగిరి రంగారెడ్డి ,సూర రమణారెడ్డి, రేలా మంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు...

# రేపు మార్కాపురం జిల్లాలో వైయస్ షర్మిల పర్యటన



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా...**చీఫ్ శ్రీమతి వైఎస్ షర్మిలా రెడ్డి రచ్చబండ కార్యక్రమం మార్కాపూర్ నియోజకవర్గంలోని తర్లుపాడు మండలం, తుమ్మలచెరువు గ్రామంలో జరగనుంది. ఈ సందర్భంగా స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బ్రహ్మనాయుడు, జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ మహబూబ్ వలి, పోలీస్ సిబ్బంది తదితరులతో కలిసి రచ్చబండ ప్రాంతాన్ని పరిశీలించి బందోబస్తు గురించి జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా వారికి వివరించారు.... షేక్ సైదా ఐజజ అధ్యక్షులు ఉమ్మడి ప్రకాశం జిల్లా, నియోజకవర్గ సమన్వయకర్త మార్కాపురం

# పొగాకులో ఉత్తమ యాజమాన్య పద్ధతుల పై శిక్షణ కార్యక్రమం





**ఒంగోలు క్రైకౌంటర్ ప్రతినిధి,**పొగాకు బోర్డు కందుకూరు -శ్రీ వేలం కేంద్రం పరిధిలోని పొన్నలూరు చెరుకూరు గ్రామంలో పొగాకు లో పాటించ వలసిన ఉత్తమ యాజమాన్య పద్ధతులు పై సమగ్ర సస్య రక్షణ, ఎరువులు యాజమాన్యం, ఆకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్ పొగాకులో అన్య పదార్థాల నిర్మూలన వంటి అంశాలపై రైతులకు , సిబ్బంది కి శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వేలం నిర్వహణ అధికారి వి.శివకుమార్ మాట్లాడుతూ అడుగు ఆకులు వొదిలేసి పక్వానికి వచ్చిన వాటిని మాత్రమే రెలచాలి అని అన్నారు. ఆకు అల్లిక సమయం లో టార్పాలిన్ పట్టాలు విడిగా ఉపయోగించాలనిఅన్నారు. గ్రేడింగ్ సమయం లో బుట్టలను అందు బాటులో ఉంచుకొని అన్యపదర్థాలను అందులో వేయాలని చెప్పారు. బారన్ లో కురో మీటర్ దీనివలన అగ్ని ప్రమాదాలను నివారించ వచ్చని తెలిపారు ఇంకా బ్యారెన్ లో క్యూరింగ్ సమయం లో తీసుకోవలసిన మెలుకువలు, జాగ్రత్తలను గురించి తెలియజేశారు. అనంతరం పొగాకు తోటలు పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఐటీసీ మేనేజర్ విజయ్ కుమార్ , జిపిఐ మేనేజర్ సుబ్బానాయుడు, పోలిశెట్టి కంపెనీ ప్రతినిధి శేఖర్ పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# బాద్యతలు చేపట్టిన నూతన ఎస్సై...






**క్రైమ్ కౌంటర్ న్యూస్.... మార్కాపురం జిల్లా....**రామయపట్నం నుంచి పొదిలి కి...మార్కాపురంజిల్లా పొదిలి నూతన ఎస్సై గా ఎస్.రాజేష్ బాద్యతలు స్వీకరించారు.గతంలో రామయపట్నం మెరెన్ ఎస్సైగా బాద్యతలు నిర్వహిస్తు పొదిలికి బదిలిపై వచ్చారు.గత రెండునెలలుగా ఎస్సై లేక పొవడంతో పట్టణంలో ప్రజలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు.నూతన ఎస్సై శాంతి భద్రతల పై ప్రత్యేక శ్రద్ద వహిస్తానని తెలిపారు...

# తిరుమల లడ్డూ పై పదేపదే మాట్లాడితే హిందువుల మనోభావాలు దెబ్బతింటాయన్న బాలినేని



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 12** తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఏపీలో ఈ అంశంపై అధికార పక్షం, వైసీపీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ అంశంపై తాజాగా జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టంగా చెప్పారని బాలినేని అన్నారు. ఆ అంశంపై పదేపదే మాట్లాడటం వల్ల హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని చెప్పారు. ఇంతటితో ఈ అంశాన్ని వదిలేయడం మంచిదని ఎవరైనా తప్పు చేసి ఉంటే వారి సంగతి వేంకటేశ్వరస్వామి, సీబీఐ వాళ్లు చూసుకుంటారని అన్నారు. ప్రకాశం జిల్లాలో జనసేన పార్టీ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనేది తమ అధినేత పవన్ కల్యాణ్ చూసుకుంటారని చెప్పారు.

## హెడ్ పోస్ట్ ఆఫీస్ లో ఆధార్ సేవలు

క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు, పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయిని పోస్ట్ మాస్టర్ ఎస్ హెచ్ జి బి1 టి . కళ్యాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 0 నుంచి 5 సంవత్సరాలు చిన్నారులకు ఉచితంగా ఆధార్ తీస్తామని ఆమె పేర్కొన్నారు. పేరు, చిరునామా, పుట్టిన తేదీ మార్పులకు రూ75 లు, బయోమెట్రిక్ రూ. 125 లను చెల్లించాలని చెప్పారు. కందుకూరు పరిసర ప్రాంతాలు ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన వైసీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్



క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,ఆది ఆంధ్ర కాలనీ లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంచికలపాటి నాగేశ్వర రావు సతీమణి యశోదమ్మ మరణించిన సందర్భంగా వారి కుటుంబాన్ని పరామర్శించి మనో ధైర్యం కందుకూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి , మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ గురువారంపరామర్శించారు.జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిశోర్ , నియోజక వర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఉచ్చులూరి రవీంద్ర , పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు చనమాల కోటేశ్వరరావు, పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రహీం, పట్టణ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తొండల ఆదాము, పట్టణ ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ జంగిలి.సుబ్బారావు ఆది ఆంధ్ర కాలనీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ, నాయకులు, కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచికలపాటి నాగేశ్వరరావు కుటుంబానికి ఆ భగవంతుడు ఎల్లవేళలా తోడుండి మనోధైర్యం కల్పించాలని ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పార్లమెంటులో సామాన్యుడి గొంతుక..



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 12దేశ రాజకీయాల్లో యువ నేతగా తనదైన ముద్ర వేస్తున్న ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, పార్లమెంటు వేదికగా సామాన్యుల సమస్యలను నిలదీస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. ప్రధానంగా నిత్యావసర ధరల పెరుగుదల, ఆహార కల్తీ వంటి అంశాలపై ఆయన చేసిన ప్రసంగాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, గణాంకాలతో సహా ప్రజల ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన విజయం సాధించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగుతున్న ఆయన ప్రసంగాలు మధ్యతరగతి ప్రజల్లో గట్టి భరోసాను నింపుతున్నాయి.దేశంలో వేగంగా విస్తరిస్తున్న గిగ్ ఎకానమీలోని లోపాలను ఎత్తిచూపడంలో రాఘవ్ చద్దా కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా '10 నిమిషాల డెలివరీ' వెనుక ఉన్న ప్రమాదాలను, డెలివరీ బాయ్స్ పడుతున్న ఇబ్బందులను ఆయన జాతీయ స్థాయిలో చర్చకు పెట్టారు. ప్రాణాలకు తెగించి పని చేస్తున్న గిగ్ వర్కర్లకు సరైన రక్షణ మరియు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన బలంగా వినిపించారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం సామాన్య కార్మికుల జీవితాలను పణంగా పెట్టకూడదని ఆయన చేసిన హెచ్చరికలు ప్రజల దృష్టిని ఆకర్షించాయి. దేశ పన్నుల వ్యవస్థలో ఉన్న అసమానతలపై కూడా రాఘవ్ చద్దా గళమెత్తారు. బడా కార్పొరేట్ సంస్థలు చెల్లించే పన్నుల కంటే, కష్టపడి పని చేసే వేతన జీవులు చెల్లించే ఆదాయపు పన్ను ఎక్కువగా ఉండటంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను భారంతో సతమతమవుతున్న వేతన జీవుల బాధలను పార్లమెంటు సాక్షిగా ఎండగట్టి, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు రావాలని కోరారు.

మొత్తంగా, పార్లమెంటులో రాఘవ్ చద్దా లేవనెత్తుతున్న అంశాలు కేవలం రాజకీయ నినాదాలు కావు, అవి కోట్లాది మంది సామాన్యుల ఆవేదనలు. ఆహార భద్రత నుండి పన్నుల వరకు ఆయన స్పృశించని అంశం లేదని చెప్పవచ్చు. పాలకులను ప్రశ్నించే గొంతుకగా నిలవడమే కాకుండా, పరిష్కార మార్గాలను కూడా సూచిస్తూ ఆయన ఒక ఆదర్శవంతమైన పార్లమెంటేరియన్ అనిపించుకుంటున్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ప్రజా సమస్యలపై ఆయన పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని సామాన్య జనం ఆశిస్తున్నారు.

# సార్వత్రిక సమ్మె విజయవంతం

క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,దేశవ్యాప్య సారత్రిక సమ్మె పిలుపులో భాగంగా ఏఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ర్యాలీ గురువారం చేపట్టారు. ఈ ర్యాలీ పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం నుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. ఏఐటీయూసీ, సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కార్మికులు కర్షకులు పోరాటం చేసి సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ తీసుకుంటున్న నిర్ణయాలను అడ్డుకునేందుకు ఏఐటియుసి సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని వారు తెలిపారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం 26000 ఇవ్వాలని వారు కోరారు. కార్పోరేట్ వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తూ పని గంటలను పెంచుతుందని అన్నారు, గ్రామాలలో ప్రతి ఒక్కరికి పనిని కల్పించాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొని రావటం జరిగిందని అయితే దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేసిందని దానిని తిప్పి కొట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని వారు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులకు అంగన్వాడీ కార్యకర్తలకు ఆశా వర్కర్లకు ప్రతి ఒక్క కార్మికులకు పనికి తగ్గ వేతనం చెల్లించకుండా కాలం గడుపుతున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇలాగే వదిలేస్తే ప్రతి ఒక్క హక్కును కార్మికులు కోల్పోయే అవకాశం ఉందని, ఇప్పటికైనా కార్మికులు మేల్కొని తమ హక్కులను కాపాడుకునేందుకు నడుం బిగించాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు. సమ్మెకు ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు కన్వీనర్ నేతి మహేశ్వరరావు, సామాజికవేత్త పాలేటి కోటేశ్వరరావు, బి. వెంకటేశ్వర్లు మద్దతు పలికి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కే మురళి, వై ఆనందమోహన్,



సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, ఏఐటీయూసీ నాయకులు బొల్లోజుల బాల బ్రహ్మాచారి, ఏఐటీయూసీ అనుబంధ పెయింట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జమ్మలమడుగు.రవి, కంకణాల చిన్న బ్రహ్మయ్య, ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవణమ్మ, నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు ఉప్పుటూరి మాధవరావు, బొజ్జ చంద్రమోహన్, సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, సిపిఎం మాజీ కౌన్సిలర్ నాదెండ్ల కోటేశ్వరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్.కె మున్వర్ సుల్తానా, డి రామ్మూర్తి, టి వెంకట్రావు, ఎస్ పవన్ కుమార్, సిఐటియు పట్టణ నాయకులు సల్మా, మహేష్, డి ఎం రాయుడు, ఎం ప్రసాద్, ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎం పద్మ, ఎస్ కే మల్లికా, ఎస్కే షాహిదా, మహబూబ్ జాన్, మున్సిపాలిటీ నాయకులు దార్ల శేషమ్మ, వడ్డె ముక్కుల రవణమ్మ, ఎద్దు కొండమ్మ,

అంగన్వాడి అధ్యక్షులు రాజేశ్వరి, కార్యదర్శి రహమతునిస, కేశవ, కుమారి మస్తానమ్మ, ఆశా నాయకులు వసుంధర, కృష్ణవేణి, ఝాన్సీ, ఆర్టీసీ నాయకులు డి రమణయ్య, వేమూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ




క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 12 వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.నాపై విమర్శలు చేయాలనుకుంటే ఒక్క విషయంలో చేయవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిసినప్పుడు ఆయన బాంబే హౌస్‌లో ఒక కప్పు టీ ఇచ్చారు. దావోస్‌లో నా పుట్టినరోజున కాగ్నిజెంట్ వారు ఒక కేక్ ఇచ్చారు. అంతకుమించి మేం లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక కప్పు టీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం" అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీకి సవాల్ విసిరారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేదని, తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉద్యోగాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలకు ఆయన ఈ విధంగా ధీటుగా బదులిచ్చారు.శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమలకు 99 పైసలకే భూముల కేటాయింపు అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. గత 20 నెలల్లో ప్రభుత్వం కేటాయించిన భూములు, కుదుర్చుకున్న ఒప్పందాలు వాటి ధరల వివరాలపై వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు ప్రశ్నలు లేవనెత్తారు. విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు.విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ. తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు

## రెరా వ్యవస్థపై సుప్రీంకోర్టు విసుగు.. "బిల్డర్లకే కొమ్ముకాస్తున్నారు.. వీటిని రద్దు చేయడమే మేలు!"

క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 12 దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని నియంత్రించి, కొనుగోలుదారుల హక్కులను కాపాడాల్సిన రెరా వ్యవస్థపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నిబంధనలను ఉల్లంఘించే బిల్డర్లకు అడ్డుకట్ట వేయాల్సింది పోయి, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీలు వారికి పరోక్షంగా సహకరిస్తున్నాయని ధర్మాసనం ఘాటుగా విమర్శించింది. సామాన్య ప్రజల ప్రయోజనాలను గాలికొదిలేసి, డిఫాల్టర్లుగా మారిన బిల్డర్ల పక్షాన నిలబడటం తప్ప ఈ సంస్థలు సాధిస్తున్నదేమీ లేదని న్యాయస్థానం అభిప్రాయపడింది.హిమాచల్ ప్రదేశ్ రెరా కార్యాలయాన్ని సిమ్లా నుంచి ధర్మశాలకు తరలించే అంశంపై విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అసలు ఈ వ్యవస్థలను ఏ ఉద్దేశంతో స్థాపించారో ప్రభుత్వాలు మరోసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు. కొనుగోలుదారులకు న్యాయం చేయడంలో విఫలమవుతున్న ఇలాంటి అథారిటీలను కొనసాగించడం కంటే రద్దు చేయడమే ఉత్తమమని ధర్మాసనం వ్యాఖ్యానించడం ఇప్పుడు రియల్ ఎస్టేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నిజానికి మధ్యతరగతి ప్రజలు తమ జీవితకాల పొదుపును వెచ్చించి ఇల్లు కొనుక్కునే సమయంలో బిల్డర్ల నుంచి ఎదురయ్యే వేధింపులను అరికట్టడానికి రెరా చట్టం వచ్చింది. అయితే, క్షేత్రస్థాయిలో ఈ అథారిటీలు కేవలం నామమాత్రపు సంస్థలుగా మారిపోయాయని, బాధితులకు సత్వర పరిష్కారం అందించడంలో వెనుకబడి ఉన్నాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బిల్డర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే



ఆరోపణల నేపథ్యంలో, వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని న్యాయస్థానం పరోక్షంగా హెచ్చరించింది.ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి రెరా పనితీరును సమీక్షించాల్సిన అవసరం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఉన్న రెరా కార్యాలయాలకు ఒక హెచ్చరికగా మారాయి. పారదర్శకత లేని వ్యవస్థల వల్ల ప్రజలకు నష్టం చేకూరుతున్నప్పుడు, అటువంటి యంత్రాంగం ఉనికిపైనే ప్రశ్నలు తలెత్తడం సహజమని ఈ తీర్పు ద్వారా స్పష్టమవుతోంది.

# సినిమా




## ఓపెన్‌గా చెప్పేసిన టాలీవుడ్ నటి


టాలీవుడ్ సీనియర్ నటి వై. విజయ తన సినీ ప్రస్థానంలోని స్టార్టింగ్ డేస్‌ను, ప్రముఖ నటుడు శోభన్ బాబుతో తనకున్న జ్ఞాపకాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. డ్యాన్స్‌పై ఉన్న తనకున్న మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన వై. విజయ.. తన తొలి చిత్రం కే. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'నిండు హృదయాలు' అని తెలిపారు. అందులో ఒక పేద అమ్మాయి పాటలో నటించానని, డ్యాన్స్‌పై పట్టు ఉండడం వల్ల ఆ సీన్స్ సులభంగా చేయగలిగానని చెప్పారు. ఆ తర్వాత 13 ఏళ్ల వయసులో రామ విజేత ఫిలిమ్స్ నిర్మించిన "తల్లిదండ్రులు" చిత్రంలో నటిగా అవకాశం వచ్చిందని ఆమె గుర్తుచేసుకున్నారు.

ఆ చిత్రానికి హీరోయిన్‌గా ఎంపికవ్వడం చాలా విచిత్రంగా జరిగిందన్నారు. రామ విజేత ఫిలిమ్స్ 18 ఏళ్ల అమ్మాయి కావాలంటూ పేపర్లలో ప్రకటన ఇవ్వగా.. మాస్టర్ ఎం.ఎస్. వై. విజయ పేరును సూచించారు. దాదాపు 2000 ఫోటోలలో నుంచి వై. విజయ ఫోటోను ఎంపిక చేశారు. అయితే సినిమా అంటే తనకు ప్రత్యేకమైన ఆసక్తేమీ ఉండేది కాదని, కేవలం డ్యాన్స్ నేర్చుకోవడమే తన ఉద్దేశ్యమని ఆమె స్పష్టం చేశారు. తను సినీ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేయడంపై తనకు పెద్దగా సంతోషం లేదని, ఎలాంటి కోరికలు లేవని చెప్పారు. అప్పట్లో ఆడపిల్లలకు ఏదో ఒకటి ఉండాలి కదా, ఫేమస్ అవ్వాలి, మంచి బట్టలు వేసుకోవాలి, మంచి పెళ్లి చేసుకోవాలి అని అంటారని, కానీ తన మైండ్‌లో అలాంటివి ఏమీ లేవని విజయ అన్నారు.

తన సినీ ప్రస్థానానికి తల్లిదండ్రులు, తోబుట్టువులు అందించిన సహకారం ఎంతో ఉందని విజయ వివరించారు. ఆమె తల్లి షూటింగ్‌లలో తనతోపాటే ఉండేవారని ఆమె తెలిపారు. తన తండ్రి "సినిమాలు చేస్తే చెయ్యని, కానీ ఏ రోజు నా కూతురి కంటి నుంచి ఒక నీటి చుక్క కూడా బయటికి రాకూడదు, ఏమైనా జరిగితే దానికి బాధ్యురాలు నువ్వే" అని తన తల్లికి చెప్పేవారని విజయ పంచుకున్నారు. సినీ రంగంలో ఆడపిల్లలకు ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడుతూ, "మన క్యారెక్టర్‌ని బట్టి ఉంటుంది ప్రతీది. మనం వేసే ప్రతి అడుగు జాగ్రత్తగా వేశామంటే అక్కడ ఎదుటి వాళ్లకు ఆ ఛాన్సే లేదు" అని చెప్పారు. తన తల్లిని చూస్తే ఎవరూ తనను అప్రోచ్ అవ్వడానికి ధైర్యం చేసేవారు కాదని, తన తల్లి మాటలు అందరితో జాలిగా ఉన్నా, తాను మాత్రం సీరియస్‌గా తలదించుకుని ఉండేదాన్ని అని తెలిపారు.

శోభన్ బాబుతో జరిగిన ఓ సరదా సంఘటనను వై. విజయ గుర్తుచేసుకున్నారు. శోభన్ బాబు తనను చూసి "ఏం చదివావ్, ఏ ఊరి నుంచి వచ్చావ్, నీ వయసెంత?" అని అడిగారని, "నా వయసులో నీకు సగం వయసు ఉందా?" అని అడగగా, అప్పుడు తాను 13 ఏళ్లని చెప్పానని వివరించారు. దానికి శోభన్ బాబు ఆశ్చర్యపోయి, "13 ఏళ్లా, ఇంత ఎత్తు ఉన్నావ్, ఏం చదివావ్, టెన్త్ వరకు చదివాను సార్, నైన్త్ ఫుల్ ఫినిష్ చేశాను. 18 ఏళ్లు లేవంటున్నావు. 13 ఏళ్లు.! ఏ ఊరు.. కడప సార్, మరి ఇంత తెల్లగా ఎలా ఉన్నావ్" అని అడిగారని గుర్తుచేసుకున్నారు. అప్పట్లో సిగ్గు పడే తన స్వభావం వల్ల శోభన్ బాబు ఉద్దేశాన్ని తాను సరిగా అర్థం చేసుకోలేదని విజయ తెలిపారు.





## 100 రోగాలకు ఈ ఒక్క ఆకుతోనే పరిష్కారం

ఉరుకులు పరుగుల ఆధునిక కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఆయుర్వేదం ప్రాధాన్యత గణనీయంగా పెరుగుతోంది. ప్రకృతి మనకు అందించిన అద్భుత ఔషధ మొక్కలలో రణపాల ఒకటి.. రణపాల ఆకులలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. ఇవి ఎన్నో సమస్యలను దూరం చేసి.. శరీరానికి అద్భుత ప్రయోజనాలు అందిస్తాయి. అందుకే.. దీనిని వంద రోగాలకు ఒక్కటే ఔషధంగా వ్యవహరిస్తారు ఆయుర్వేద నిపుణులు.. రణపాల మొక్కలో ఉన్న గొప్పతనం ఏమిటంటే, ఇది శరీరంలో వచ్చే దాదాపుగా అన్ని రోగాలపై అద్భుతంగా పనిచేస్తుంది. తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, రక్తపోటు, మధుమేహం (డయాబెటిస్), పుండ్లు, చర్మ వ్యాధులు, వేడి పొక్కులు, గుండె వ్యాధులు, మూత్రనాళాలకు సంబంధించిన సమస్యలు, రక్త శుద్ధి, జుట్టు పటుత్వం, గ్యాస్ట్రిక్ అల్సర్లు, మోకాళ్ళ నొప్పులు, రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ఇలా అనేక రకాల ఆరోగ్య సమస్యలకు రణపాల ఏకైక పరిష్కారంగా చెప్పవచ్చు. రణము అంటే శోధన, పాల అంటే దాన్ని శాసించేది అనే అర్థం.. అందుకే.. రణపాల ఆకుని లీఫ్ ఆఫ్ లైఫ్ అని కూడా పిలుస్తారు. దీనికి జీవాన్నిచ్చే శక్తి ఉంటుంది కాబట్టే ఈ పేరు వచ్చిందంటున్నారు ఆరోగ్య నిపుణులు..


శాస్త్రీయంగా దీన్ని బ్రయోఫిల్లం అని అంటుంటారు. బ్రయోఫిల్లం అంటే స్వయంగా మొలకెత్తే ఆకు అని అర్థం. ఈ ఆకుని మట్టిలో వేసినా, ఆకు అంచుల నుంచి కొత్త మొక్కలు పుట్టుకొస్తాయి. ఈ రణపాల మొక్క 10 నుండి 15 రోజుల పాటు నీళ్ళు పోయకపోయినా కూడా వాడిపోకుండా ఉంటుంది. వీటిలో కొంత నీరు నిల్వ ఉండటం వలన వీటిని సక్కంబలెంట్ లీవ్స్ అని కూడా అంటారు. కేథడ్రల్ బెల్స్, కలాంచోయే పిన్నాటా, పత్తర్ చట్టా వంటి పేర్లతో రణపాల ఆకుని వివిధ భాషల్లో పిలుస్తుంటారు.

రణపాల ఆకు ప్రధాన ప్రయోజనాలలో ఒకటి కిడ్నీలో రాళ్లకు బ్రహ్మాస్త్రంలా పనిచేయడం. ఈ ఆకుని కషాయంలా చేసుకొని తాగితే, కిడ్నీలో రాళ్లతోపాటు మూత్రాశయంలో అడ్డంకులన్నీ తొలగిపోతాయి. రణపాల ఆకుని మెత్తగా నూరి గాయాలపైన, వేడి పొక్కుల పైన పూతలా రాసుకుంటే, పుండు రెండు రోజుల్లో నయం అవుతుంది. రణపాల ఆకులపై ఉప్పు రాసి నమిలినా చాలు, ఆ రసం రక్తశుద్ధికి బాగా ఉపయోగపడుతుంది. ఇది రక్తంలో మలినాలన్నింటినీ తొలగించడమే కాకుండా, రక్తనాళాల్లో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌ను కూడా తొలగించి రక్త ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చేస్తుంది.

రణపాల ఆకులను మెత్తగా నూరి జ్యూస్ లా తాగితే గ్యాస్ట్రిక్ అల్సర్లు దరిచేరవు. రణపాల ఆకుల జ్యూస్ అద్భుతమైన ఇమ్యూనిటీ బూస్టర్ కూడా. అంతేకాదు, ఈ ఆకులో ఉన్న యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ అలర్జిక్, యాంటీబయాటిక్ గుణాలు కీళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, తలనొప్పి, మెడనొప్పి వంటి ఎటువంటి రోగానికైనా అద్భుతంగా పనిచేస్తాయి.

రణపాల ఆరోగ్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇది దాదాపు 30-40 రోగాలకు ఒక్కటే మందుగా పనిచేస్తుంది. ఈ మొక్కని మనమందరం మన ఇళ్ళల్లోనే పెంచుకోవచ్చు. ఎలాంటి నేలపై అయినా ఈ మొక్క బ్రతుకుతుంది. పెరట్లోనే ఈ మొక్కని పెంచుకుంటూ, రోజూ ఆ చెట్టు ఆకులని తింటుంటే ఎటువంటి అనారోగ్యాలు దరిచేరవని ఆయుర్వేదం తెలియజేస్తోంది.

మీకు ఏమైనా సమస్యలుంటే.. రణపాల వినియోగించే ముందు.. వైద్య నిపుణులను లేదా ఆయుర్వేద నిపుణులను సంప్రదించండి..



## తిప్ప తీగ కషాయం ఇలా మాత్రమే తాగండి...

తిప్పతీగ, ఆయుర్వేదంలో అమృతవల్లి లేదా గుడిచిగా పిలవబడే ఒక ప్రాచీన ఔషధ మొక్క. దీనికి గిలాయ్ అనే మరో పేరు కూడా ఉంది. ఈ పాదు చాలా విస్తారంగా పెరుగుతుంది. ముఖ్యంగా తుమ్మచెట్లపైన, గోడలపైన, ఫెన్సింగ్‌లపైన సాధారణంగా కనిపిస్తుంది. దీని కాండం, ఆకులు రెండూ ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. తిప్పతీగ ఆకు హృదయాకారంలో ఉండటం, తుంచినప్పుడు పాలు రాకపోవడం వంటి లక్షణాలతో దీనిని సులభంగా గుర్తించవచ్చు. ఆకుపైన ఆకుపచ్చగా, వెనుక భాగంలో తెలుపు రంగులో ఉంటుంది. తిప్పతీగకు ఆయుర్వేదంలో అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇది అనేక రకాల వ్యాధుల నుంచి రక్షించే సామర్థ్యం కలిగి ఉండటం వల్ల దీనిని అమృతంతో సమానంగా భావిస్తారు. ఇది శరీరంలో రోగనిరోధక వ్యవస్థను వేగంగా ఉత్తేజపరిచి, రక్షణ వలయాన్ని ఏర్పరుస్తుంది.

ఒకరి నుంచి ఇంకొకరికి సోకే వ్యాధులకు, ముఖ్యంగా వైరల్ జ్వరాలకు ఇది సమర్థవంతమైన ఔషధం. అలర్జీలను అదుపు చేయడమే కాకుండా, దీర్ఘకాలిక దగ్గు, ఉబ్బసం వంటి శ్వాసకోశ సంబంధిత సమస్యలను కూడా నివారిస్తుంది. టాన్సిల్స్ సమస్యలను తగ్గిస్తుంది. దీనిలోని యాంటీబయోటిక్ గుణాలు క్యాన్సర్‌ను నిరోధించి, కొత్త కణాల అభివృద్ధికి దోహదపడతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు తిప్పతీగ ఒక వరం. ఇది ఇన్సులిన్‌ను నియంత్రించి, రక్తంలోని గ్లూకోస్ స్థాయిని అదుపు చేయడంలో సహాయపడుతుంది. అప్పుడప్పుడు తిప్పతీగ కషాయాన్ని సేవించడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గి బరువు తగ్గడానికి కూడా తోడ్పడుతుంది. పచ్చి తిప్పతీగ కాయలు ఆకుపచ్చ రంగులో ఉండి, పండిన తర్వాత ద్రాక్ష గుత్తుల వలె ఎరుపు రంగును సంతరించుకుంటాయి. తిప్పతీగ పొడిని పాలతో కలిపి తీసుకుంటే కీళ్ల సంబంధిత వ్యాధులను ఎదుర్కోవచ్చు.

## హైలైట్స్: ఇషాన్, హార్దిక్ కౌంటర్-అటాక్, నమీబియా బౌలర్లు షాక్‌లో!

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా న్యూఢిల్లీ వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ మరియు హార్దిక్ పాండ్యా ఫార్మ్‌ఫుల్ ఇన్నింగ్స్ ప్రదర్శించారు. ఇషాన్ కిషన్ 24 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 61 పరుగులు చేసి క్రీజ్‌ను జల్లెడ చేయగా, హార్దిక్ పాండ్యా 27 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52 పరుగులు చేసి భారతానికి మంచి స్కోరింగ్ స్థిరత్వాన్ని ఇచ్చారుముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసింది. నమీబియా బౌలర్లు బాగా కట్టుబట్టిన బౌలింగ్‌తో భారీ స్కోర్ సాధించడాన్ని అడ్డుకున్నారు. నమీబియా కెప్టెన్ గెర్‌హార్డ్ ఎరాస్మస్ 4/20తో నాలుగు వికెట్లు తీశారు. అలాగే, బెన్ షికోంగో, జేజే స్మిత్, బెర్నార్డ్ స్కాల్ట్జ్ ఒక్కో వికెట్‌ను తీశారు.ఓపెనర్లు ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ జోరుగా ఇన్నింగ్స్ ప్రారంభించారు. సంజూ శాంసన్ 22 పరుగులు చేసి అనవసర షాట్‌తో అవుట్ అయినప్పటికీ, ఇషాన్ కిషన్ తిలక్ వర్మతో కలిసి పరుగుల ధాటిని కొనసాగించాడు. 6వ ఓవర్‌లో జేజే స్మిత్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ వరుసగా 4 సిక్స్‌లు, 1 ఫోర్ కొట్టి 20 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు.ఇషాన్ కిషన్ విరుచుకుపాటు తరువాత, నమీబియా బౌలర్లు ఫీల్డ్‌లో తలపట్టారు. కెప్టెన్ ఎరాస్మస్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ క్యాచ్ అవుట్ అయ్యాడు. రెండో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం ఏర్పడింది.తరువాత సూర్యకుమార్ యాదవ్ (12), తిలక్ వర్మ (25) విఫలమైనప్పటికీ, హార్దిక్ పాండ్యా మళ్లీ ఫార్మ్‌లోకి వచ్చాడు. భారీ సిక్సర్లతో బౌలర్లను కలకలం రేపాడు. గెర్‌హార్డ్ బౌలింగ్‌లో హాఫ్ సెంచరీ సాధించిన హార్దిక్ మరుసటి బంతికే అవుట్ అయ్యాడు. ఆ తర్వాత శివమ్ దూబే 23 పరుగులు చేసి రనౌటవ్వగా, చివరి బంతిలో అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. చివరి ఓవర్‌లో రింకూ సింగ్, అర్ష్‌దీప్ సింగ్ కూడా అవుట్ కావడంతో, భారత్ 230 పైగా స్కోరు సాధిస్తుందని భావించినా 209 పరుగులకే పరిమితమైంది.



## టీ20 ప్రపంచకప్‌లో నేపాల్‌పై ఇటలీ 10 వికెట్ల తేడాతో ఘనవిజయం

టీ20 ప్రపంచకప్ 2026లో ఇటలీ జట్టు సంచలనం సృష్టించింది. టోర్నీలో తమ తొలి విజయాన్ని అత్యంత ఘనంగా నమోదు చేసింది. గురువారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో, ఇటలీ ఏకంగా 10 వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తుగా ఓడించింది. సోదరులైన ఓపెనర్లు జస్టిన్ మొస్కా, ఆంథోనీ మొస్కా విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగి, ఒక్క వికెట్ కూడా పడకుండా తమ జట్టును గెలిపించారు. ఈ టోర్నీ చరిత్రలోనే ఇటలీకి ఇది తొలి విజయం కావడం విశేషం.నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో, ఇటలీ ఓపెనర్లు ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగారు. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌కు గట్టిపోటీ ఇచ్చిన నేపాల్ బౌలర్లకు వారు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. పవర్‌ప్లే ముగిసేసరికి ఇటలీ వికెట్ నష్టపోకుండా 68 పరుగులు చేసి తన ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. ముఖ్యంగా జస్టిన్ మొస్కా 44 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరో ఎండ్‌లో అతని సోదరుడు ఆంథోనీ మొస్కా మరింత దూకుడుగా ఆడి కేవలం 32 బంతుల్లో 3 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో 62 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వీరిద్దరూ కలిసి 12.4 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.ఈ క్రమంలో ఈ సోదరులు ఓ అరుదైన రికార్డును కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. టీ20 ప్రపంచకప్‌లో తోబుట్టువులు నెలకొల్పిన అత్యధిక భాగస్వామ్యం (124లి) రికార్డును సృష్టించారు. గతంలో 2014లో పాకిస్థాన్‌కు చెందిన కమ్రాన్ అక్మల్, ఉమర్ అక్మల్ నెలకొల్పిన 96 పరుగుల భాగస్వామ్యాన్ని వీరు అధిగమించారు.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నేపాల్, ఇటలీ బౌలర్ల ధాటికి 19.3 ఓవర్లలో 123 పరుగులకే కుప్పకూలింది. ఇటలీ బౌలర్ క్రిషన్ కలుగామగే (3/18) కీలక వికెట్లు పడగొట్టి నేపాల్ పతనాన్ని శాసించాడు. నేపాల్ జట్టులో ఆసిఫ్ షేక్ (26), కెప్టెన్ రోహిత్ పౌడెల్ (23) మాత్రమే కాస్త రాణించారు. ఒక దశలో 98 పరుగులకు 5 వికెట్లతో ఉన్న నేపాల్, చివరి 25 పరుగులకే మిగిలిన 5 వికెట్లను కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com